తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
24 ఆగష్టు 2026
పేజీలు : 8

# చినుకులు పడ్డాయ్..
# రైతు గుండె తడిసింది

- గుర్రంపోడు మండలంలో కురిసిన వాన.. రైతుల ముఖాల్లో చిరునవ్వు
- పశువులకు తీరనున్న నీటి కష్టాలు.. పచ్చగడ్డిపై రైతుల్లో ఆశలు




**గుర్రంపోడు ఆగస్టు 23 (జనంసాక్షి):**
గత కొన్ని నెలలుగా సరైన వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గుర్రంపోడు మండలంలో రైతులకు ఇటీవల కురుస్తున్న వర్షాలు కొంత ఊరటనిస్తున్నాయి. గత మూడు, నాలుగు రోజులుగా మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎండిపోయిన భూముల్లో తేమ చేరడం, పొలాల్లో నీరు నిల్వ ఉండటం, చెరువులు, కుంటలు, గుంతల్లో నీరు చేరుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.వర్షాల కోసం ఎదురుచూపులు..

గత కొన్ని నెలలుగా వర్షాలు సరిగా లేకపోవడంతో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సాగు పనులు ముందుకు సాగకపోవడంతో పాటు పంటల పరిస్థితిపై కూడా రైతుల్లో ఆందోళన నెలకొంది. భూమిలో తేమ లేకపోవడం, నీటి వనరులు ఎండిపోవడంతో సాగు చేయడం కష్టంగా మారింది. దీంతో ఆకాశం వైపు చూస్తూ వర్షాల కోసం రైతులు ఎదురుచూశారు. అయితే గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితుల్లో కొంత మార్పు కనిపిస్తోంది. వర్షపు నీటితో పొలాల్లో తేమ పెరగడంతో పంటలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే విధంగా వర్షాలు కురిస్తే సాగుకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు.

**పశువులకు నీటి కష్టాలు తీరేనా?**
వర్షాలు లేకపోవడంతో రైతులతో పాటు పశుపోషకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పశువులను మేపేందుకు తీసుకెళ్లిన సమయంలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పశువులకు నీరు అందించడం కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో గుంతలు, కుంటలు, చెరువుల్లో నీరు నిల్వ ఉండటంతో పశువులకు తాగునీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఏర్పడింది. దీంతో పశు పోషకులు కూడా ఊరట చెందుతున్నారు.పచ్చగడ్డిపై రైతుల్లో ఆశలు

వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే మండలంలోని బీడు భూములు, పశువుల మేత ప్రాంతాల్లో పచ్చగడ్డి విస్తారంగా పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గత కొంతకాలంగా పచ్చగడ్డి కొరత కారణంగా పశువులను మేపేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు తాజా వర్షాలు ఆశాజ్యోతిగా మారాయి.పొలాలు, పశువుల మేత ప్రాంతాలు పచ్చగా మారితే పశువులకు సహజంగా మేత లభించడంతో పాటు పశుపోషణపై రైతులకు కొంత భారం తగ్గుతుందని రైతులు ఆశిస్తున్నారు.“ఇదే వాన మరికొన్ని రోజులు పడాలి”“కొన్ని నెలలుగా వర్షాల కోసం ఎదురుచూశాం. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో భూమిలో తేమ వచ్చింది. పశువులకు కూడా అక్కడక్కడ నీరు అందుబాటులోకి వచ్చింది. వర్షాలు మరికొన్ని రోజులు ఇదే విధంగా కురిస్తే పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. పచ్చగడ్డి పెరిగితే పశువులకు కూడా మేత సమస్య ఉండదు” అని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రైతన్నలో చిగురించిన ఆశలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు గుర్రంపోడు మండల రైతులకు పూర్తిస్థాయి ఊరటనివ్వకపోయినా, భవిష్యత్తుపై ఆశలు కలిగిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు మరికొంత కాలం కొనసాగి చెరువులు, కుంటలు, నీటి వనరులు పూర్తిస్థాయిలో నిండితే సాగునీటి సమస్య కూడా కొంతవరకు తీరుతుందని ఆశిస్తున్నారు.వర్షాల జోరుతో నేల తడుస్తుండగా.. రైతన్న గుండెల్లో మాత్రం కొత్త ఆశలు మొలుస్తున్నాయి. పచ్చబడుతున్న పల్లెను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయానికి అన్నపూర్ణ పరస్కారం
## సతీష్ కుమార్ శర్మకు గురుపురస్కారం ప్రధానం

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయస్వామి వారి దేవాలయంకు దక్షిణ భారత దేశంలో ప్రముఖ దేవాలయాలకు మహాశాస్త్ర సేవా సంఘం అందించే ప్రతిష్టాత్మకమైన అన్నపూర్ణ పురస్కారం లభించింది.ఈ సంఘం దక్షిణ భారతదేశంలో ఎంపిక చేసిన 12 దేవాలయాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఈ దేవాలయం ఉండటం విశేషం.దీంతో పాటు దేవాలయ ప్రధాన అర్చకులు రేంటాల సతీష్ కుమార్ శర్మ దేవాలయంలో నిర్వహిస్తున్న విశేష పూజలతో పాటు ఆయన చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిన సంఘం గురుపురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు అర్చకులు మాట్లాడుతూ దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం, సతీష్ కుమార్ శర్మ గురుపురస్కారం అందుకోవడం హర్షణీయమని అన్నారు.అనంతరం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.ఈ కార్యక్రమంలో అనంతుల గణేష్ రామలింగయ్య, అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, యుగేందర్, శివ, వాసుదేవరావు, ప్రభాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.








# గ్రామాల్లో పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- విష జ్వరాలతో వణుకుతున్న పల్లెలు ఏజెన్సీ అలవెన్సులు పొందుతూ పట్టించుకోని పంచాయతీ అధికారులు...వైద్య ఆరోగ్యశాఖ అధికారులు...
- ఏజెన్సీ గ్రామ పంచాయితీ సమస్యల పై కన్నెత్తి చూడని మండల అభివృద్ధి అధికారులు
- ఏజెన్సీ గ్రామ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపని మండల ప్రభుత్వ వైద్యాధికారులు

**కామేపల్లి,ఆగస్టు 23 (జనంసాక్షి):-**
వర్షాకాలం వచ్చిన పంచాయతీ అధికారులలో చురుకుతనం కనిపించడం లేదు... అటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు...పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి కంపు కొడుతుంది... ఇది కామేపల్లి మండలం లోని గ్రామాల పరిస్థితి... మండల కేంద్రమైన కామేపల్లి తో పాటు రామకృష్ణాపురం, ఊట్కూర్, జోగుగూడెం, తాళ్ల గూడెం,టేకుల తండా, పింజర మడుగు, పాత లింగాల, కొత్తలింగాల, బర్ల గూడెం, గరిడేపల్లి, పొన్నెకల్, ముచ్చర్ల, జాస్తిపల్లి, మద్దులపల్లి,లాల్య తండా,బాసిత్ నగర్,జగన్నాథ్ తండా,రుక్కితండా గ్రామాల్లో పారిశుధ్యం కంపు కొడుతుంది. ఈ ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ప్రజలకు విష జ్వరాలు తగులుతున్నాయి . గ్రామాల్లో పారిశుధ్యం ను మెరుగుపరచాల్సిన గ్రామపంచాయతీ కార్యదర్శులు కనీసం స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. వీరు చుట్టపు చూపు వచ్చి పోతున్నారు తప్ప ఎలాంటి పని చేయించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరిని సమన్వయం పర్చాల్సిన మండల పంచాయతీ అధికారి

మిగతా 2లో

# గంజాయి మత్తులో పోలీసులకు పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు

## రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలింపు

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం తాళ్ల బొమ్మూరు ఐటీసీ జామాయిల్ ప్లాంటేషన్ వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నిన్న ప్లాంటేషన్ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న గడికొప్పుల శశికుమార్, సోము సీతారామిరెడ్డి, మహమ్మద్ అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో తదుపరి చర్యల్లో భాగంగా భద్రాచలంలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్సై మేడా ప్రసాద్ తెలిపారు. గంజాయి సేవనం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ ఐ మేడా ప్రసాద్ తెలిపారు.



# గ్రామాల్లో పారిశుధ్యం..

## అస్తవ్యస్తం

తన విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మీరు కనీసం గ్రామపంచాయతీల్ని విజిట్ చేసిన పాపాన పోవడం లేదని దీంతో పంచాయతీ కార్యదర్శులు ఆడింది ఆట పాడిన పాటగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరి పరిస్థితి ఇలా ఉండగా మండల పంచాయతీ అధికారి గ్రామ సర్పంచ్ల కాంట్రాక్టుల పనుల బిల్లుల విషయంపై ప్రత్యేక దృష్టి సాధిస్తున్నారని ఆ గ్రామాల్లో పాలకవర్గ సభ్యులు గుసగుసలాడుతున్నారు అది అలా ఉండగా. గ్రామాల్లో విష జ్వరాలు వ్యాపించి ప్రజలు మంచాల బారిన పడుతున్న వైద్య అధికారులు, ఏఎన్ఎంలు,సూపర్వైజర్లు గ్రామాల్లో కనీసం పర్యటించి ఆరోగ్య శిబిరాలు నిర్వహించిన పాపాన్న పోవడం లేదు.ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారందరికీ కనీస సౌకర్యాలు ఉండవని ప్రభుత్వం స్థానికంగా నివాసం ఉండాలనే లక్ష్యంతో ప్రతినెల జీతంతో పాటు ఏజెన్సీ అలవెన్సులు ఇస్తుంది.అయినా అటు జీతం ఇటు ఏజెన్సీ అలవెన్సులు పొందుతున్న ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండా పోగ ఉండ కపోగా కనీసం ప్రజలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పట్నాల నుండి రాకపోకలు కొన సాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి పల్లెలు మంచం పట్టకముందే స్పందించి ఉద్యోగులు స్థానికంగా ఉండి సకాలంలో తమకు సేవలు అందించాలని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# సిపిఎం సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు మృతి

**బూర్గంపహెడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు కందుకూరి నాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తదితర నాయకులు నివాళు లర్పించారు. పార్టీ పట్ల క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసిన నాగేశ్వరరావు సేవలను నాయకులు కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల బంద్కు సిపిఐ మద్ధతు

**ఖమ్మం, ఆగస్టు 23 ( జనంసాక్షి)**



ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్కు సిపిఐ ఖమ్మంజిల్లా సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. పెరిగిన ఇంధన ధరలు, అధిక పన్నులు, ఇన్సూరెన్స్ భారంతో డ్రైవర్లు ఆర్థిక భారంతో ఇబ్బందులు –పడుతున్నారన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్ల వల్ల ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఆటోల బంద్కు ప్రజలు కూడా సహకరించాలని సురేష్ కోరారు.

# పేదరికంలో ఉన్న కుటుంబాలకు అండగా.. దుస్తుల పంపిణీ

## - శ్రీరాంపురంలో లిటిల్ కాజ్ సొసైటీ సేవా కార్యక్రమం

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**





పేదరికంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ లిటిల్ కాజ్ సొసైటీ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. బూర్గంపహాడ్ మండలం శ్రీరాంపురం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించి, అవసరమైన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు గ్రామస్థులతో మమేకమై వారి అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అవసరంలో ఉన్న కుటుంబాలకు చేయూతనందించడమే తమ సేవా లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య అవగాహన, సామాజిక అభివృద్ధి, మానవతా సేవలకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ కాజ్ సొసైటీ డైరెక్టర్ నిదానపల్లి ప్రసాద్, సమన్వయకర్త పడిగ నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సేవా ప్రస్థానానికి 25 ఏళ్ల మైలురాయి..

## - ఐటీసీ రోటరీ క్లబ్ వేడుకలు ఘనంగా..

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**




సేవా కార్యక్రమాల్లో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఐటీసీ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్‌భద్ర 25వ ఇన్‌స్టాలేషన్ డే వేడుకలు సారపాక కళాభారతిలో ఘనంగా నిర్వహించారు. ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్ర సింగ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ పిలానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గత 25 ఏళ్లుగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. సమాజ సేవలో రోటరీ సంస్థల పాత్ర, సేవా కార్యక్రమాల ప్రాధాన్యాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ వివరించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 16 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. గత 25 ఏళ్లలో క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులుగా సేవలందించిన వారి కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆర్.పీ.సింగ్, కార్యదర్శిగా డేవిడ్ ఆలివర్ బాధ్యతలు స్వీకరించారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా డి.చరణ్, కార్యదర్శిగా పి.రమ్య ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు రాంబాబు, జేకే దాస్, పూర్వ కార్యదర్శి చాంద్‌పాషా, అసిస్టెంట్ గవర్నర్ కె.వి.రెడ్డి, పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.శంకర్‌రెడ్డి, రోటరీ సభ్యులు పి.శ్యామ్ కిరణ్, డి.పి.రాయ్, ఏ.సాయిరాం, ఎం.మురళీధర్, సూర్యప్రకాశ్, జి.శ్రీనివాస్, తిరుపతిరావు, ప్రఫుల్లా, ఎం.ఫణి, బి.ఎం.ఎస్ సభ్యులు, గుత్తేదారులు పి.దుర్గాప్రసాద్, సత్యనారాయణ, మహేష్‌రెడ్డి, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న రైతుకు ఆర్థిక సహాయం అందించిన కాసాల

**చండూరు,ఆగస్టు 23 (జనంసాక్షి)**

చండూరు మున్సిపాలిటీ పరిధిలోనీ చెదురుపల్లి శ్రీనివాసులు కు చెందిన వ్యవసాయ రైతు యొక్క ఎద్దు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. ఇట్టి విషయం తెలిసిన వెంటనే భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి సంబంధిత రైతుని ఓదార్చి తన వంతు సహాయంగా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరక మీది ఎద్దు మరణిస్తే రైతు కుటుంబం యొక్క దుఃఖం బాధ వర్ణించలేనిదని అన్నారు. కర్నాటి నరసింహులు, కారింగు వెంకన్న కన్నెబోయిన నాగరాజు పలువు రైతులు పాల్గొన్నారు.



# నేడు ఆటోల బందును జయప్రదం చేయండి

## ఐ ఎఫ్ టి యు పిలుపు

**టేకులపల్లి,ఆగస్టు 23(జనంసాక్షి):**

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం టేకులపల్లిలో 24 న జరుగు ఆటోల బందును జయప్రదం చేయాలని ఆటో కార్మికులు అందరూ పాల్గొనాలని తెలంగాణ ప్రగశీల ఆటో వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు టేకులపల్లి మండల నాయకులు ఎండి షఫీ,బానోత్ లక్ష్మణ్,మోహన్, ధరావత్ శ్రీను అన్నారు.టేకులపల్లి బోడు రోడ్డు అడ్డాలో జరిగిన ప్రచారంలో వారు మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈవి ఆటోలను ఆర్టీసీ యాజమాన్యంకు అప్పగించాలనే ఆలోచనలను విరమించుకోవాలని ఇవి ఆటోలను ఆటో కార్మికు లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.న్యాయమైన ఆటో కార్మికుల ఒక్కరోజు ఆటోల బందుకు ఆటో కార్మికులు ప్రయాణికులు సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జార నవీన్, మోకాళ్ళ సురేష్,సంతోష్,కుమార్,మహేష్, చందర్,కొమరం పులి తదితరులు పాల్గొన్నారు.



# హరి కిషన్ రచించిన శ్రీశైల మల్లీనాథ శతకం, శ్రీశైలం క్షేత్రం సన్నిధిలో పుస్తకావిష్కరణ

**తుంగతుర్తి ఆగస్టు 23 (జనం సాక్షి)**
మండల కేంద్రానికి చెందిన సాహితీవేత్త కవి పండితుడు జ్యోతిష సిద్ధాంతి పంచాంగ కర్త రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హరికిషన్ 120 సీసా పద్యాలతో రచించిన మల్లీనాథ శతకంను ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ లోని నంద్యాల జిల్లా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆలయం మర్యాదలతో ధర్మ పదం నందు పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు, ఈయన గతంలో 'ఎర్రన' అనే కలం పేరుతో సుమారు 20 పైగా రచనలు చేశారు. నాలుగు శతకాలు, రెండు ఖండకావ్యాలు కొన్ని పారాయణ గ్రంథాలు, మరికొన్ని విమర్శనాత్మకమైన విశ్లేషణాత్మక మైన గ్రంథాలను రచించారు. శ్రీ భ్రమ రాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీశైల మాహాత్మ్యము పేరుతో ఆలయ చరిత్ర, చారిత్రక నేపథ్యం, భక్తుల విశ్వాసాలు, నమ్మకాలు, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి మహిమలు, శివదీక్షాపరుల




విషయాలు, చెంచులు, కోయలు భక్తి ప్రప త్తులు, శ్రీ కృష్ణదేవరాయలు, శివాజీ, ప్రతా పరుద్రుడు లాంటి రాజులు కట్టించిన కట్టడాలు ఇత్యాది విషయాలతో పాటుగా సామాజిక సమస్యల్ని కూడా శివునికి నివేదించుకునే క్రమంలో 120 సీస పద్యాలతో "మల్లీనాథ శతకం" రచించారు ఈ పుస్తకాన్ని శ్రీశైల మల్లికార్జున స్వామికే అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా హరికిషన్ను వేద పండితులు ఆశీర్వదించి ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమం లో ఆలయ పిఆర్ఓ శ్రీనివాసరావు, ప్రముఖ కవి దొరవేటి చెన్నయ్య, వర్ధమాన సినీనటి సీతాంజలి, వేద పండితులు సత్య బ్రహ్మచారి, తుంగతుర్తి సాహితి వేదిక అధ్యక్షులు గుండెగాని శ్రీనివాస్, గడ్డం కృష్ణారెడ్డి, ఆలకుంట్ల లింగయ్య, ఎర్ర యశ్వంత్ రాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో కాడెద్దు మృతి..

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం..

**చండూరు, ఆగస్టు 23 (జనంసాక్షి)**
నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్యకుంట సమీపంలో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్ తగిలి ఓ కాడెద్దు అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరుకు చెందిన రైతు చెదురువెల్లి శ్రీను (తండ్రి: యాదయ్య) తన వ్యవసాయ



క్షేత్రంలో పనుల నిమిత్తం ఉదయం ఎడ్లను నీళ్లు తాగించడానికి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరు / వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో కాడెద్దు విద్యుదాఘాతానికి గురై మరణించింది. వ్యవసాయ పనుల్లో ఎంతో ఆసరాగా ఉన్న ఎద్దు చనిపోవడంతో రైతు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. దీనివల్ల తమకు సుమారు ?90,000 వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటిపర్యంతమయ్యాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు. మండలంలో గత పది రోజుల్లోనే రెండు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు, రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు, స్తంభాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైన్లను అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా తానీషా

**వలిగొండ, ఆగస్టు 23( జనంసాక్షి )**
బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండలంలోని సంగెం గ్రామానికి చెందిన తానీషా గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై



నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడిగా దక్షిణ చారి

**గుర్రంపోడు, ఆగస్టు 23: (జనంసాక్షి)**
గుర్రంపోడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన ములకలపల్లి గ్రామానికి చెందిన పోలోజు దక్షిణ చారి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ములకలపల్లి గ్రామంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి, మండలి లింగయ్య పాల్గొని మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన దక్షిణ చారి మండల స్థాయి గౌరవ అధ్యక్షులుగా ఎంపిక కావడం ములకలపల్లి గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. నూతన కమిటీ నాయకత్వంలో మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా తోడ్పడాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం నూతన గౌరవ అధ్యక్షులు పోలోజ్ దక్షిణ చారి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి, ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకరాచారి, పాండ్ర చారి, అనంత చారి, బిక్షమాచారి, ఆచారి, పగిళ్ల భాస్కర్, భీమనపల్లి ఆంజనేయులు, మండలి భూషయ్య, భూపాల్, రాజు, పోలోని యాదాద్రి, జాల యాదాద్రి, పొగాకు అనూష్ రాజు, భీమనపల్లి లచ్చయ్య తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.





# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వల్లపు సోమయ్య మృతి

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 23 (జనంసాక్షి)**
మండలంలోని కోడూరు గ్రామ సర్పంచ్ వల్లపు అవిలమ్మ గారి భర్త, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లపు సోమయ్య ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం మృతుని కుటుంబీకులను పరామర్శించి, సోమయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుడిపెల్లి మధుకర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ ఇందుర్తి వెంకట్ రెడ్డి, వేల్పుల రమేష్, మాజీ జడ్పీటీసీ కొర్రపిడుత అవిలయ్య, కోడూరు గ్రామ శాఖ అధ్యక్షులు సామ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**మునగాల, ఆగష్టు 23(జనంసాక్షి):**
మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను సర్పంచ్ చల్ల గురవయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని నిరుపేదల శుభకార్యాలకు యశోద ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ నరాల రుక్మారావు ఆధ్వర్యంలో ఉచితంగా మినరల్ వాటర్ ను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఐదు రూపాయలకే వాటర్ క్యాన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఫౌండేషన్ చైర్మన్ నరాల రుక్మా రావు, నరాల వెంకటేశ్వరరావు, పి. రమేష్ బాబు, కుమ్మరి వెంకన్న, రోలింగ్ శ్రీను, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకల్లో పాల్గొన్న కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ టౌన్ ఆగస్టు 23 ( జనంసాక్షి );**
కోదాడ పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి



బోనం ఎత్తుకొని పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని,ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి,స్థానిక వార్డు కౌన్సిలర్ షాబుద్దీన్, ఇతర కౌన్సిలర్లు వార్డు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



# రామాపురంలో ఘనంగా బోనాల పండుగ

**నేరేడుచర్ల ఆగస్టు23 (జనంసాక్షి):**
మున్సిపాల్టీ పరిధిలోని రామాపురంలో గ్రామంలో ఆదివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత ముత్యాలమ్మకు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే నైవేద్యాలు సిద్ధం చేసుకున్న మహిళలు బోనాలను అందంగా అలంకరించి నెత్తిన ఎత్తుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ సందడి నెలకొంది. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని,గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎస్ఐ గోపాల్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ వాసా జ్యోతి శేఖర్,గ్రామ పెద్దలు కొదమ గుండ్ల నాగరాజు, చందమల్ల వెంకన్న, చందమల్ల లక్ష్మయ్య, సామ సురేష్, శివనేని విజయ్,అనిల్,ఏసు ,గ్రామ మహిళలు,యువత,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో కొలువై ఉన్న శ్రీఎరుకల నాంచారమ్మ తల్లి బోనాల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో పండుగలకు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు.నాంచారమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ కుంభం రాజేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్



కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, కౌన్సిలర్లు మన్నెం అరుణ మల్లేష్, ఈద ప్రవీణ్, దైద కృష్ణ, ఈద ప్రవీణ్, రాచూరి శ్రీను, మొగిలి రాములు, మొగిలి లింగయ్య, నల్గొండ వెంకన్న, మొగిలి దశరథ, చర్లపల్లి వెంకన్న, వెలుగు రాములు, మొగిలి యాదగిరి, మొగిలి ఉప్పలయ్య, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి దారుణ హత్య





**చౌటుప్పల్ ఆగస్టు 22(జనం సాక్షి)**
మండల పరిధిలోని పంతంగి గ్రామం శనిగల గుట్ట వద్ద అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య (36), దారుణంగా హత్యకు గురయ్యారు.స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సంఘటనా స్థలంలో కీలక ఆధారాలు సేకరించేందుకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. నిపుణుల బృందం ఆధారాలను సేకరించగా, పోలీసులు స్థానికులను, సంబంధిత వ్యక్తులను అడిగి వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, హత్యకు గల కారణాలు, నిందితుల ఆచూకీ కోసం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతున్నారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ మన్మధ కుమార్ తెలిపారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజాభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో పద్మశాలి సేవా సమాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నోట్ పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య మాత్రమే సమాజాన్ని మార్చగల శక్తి అని అన్నారు.సంక్షేమ పథకాల కంటే విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 12 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ప్రజలు కష్టపడి, స్వశక్తితో అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వ విధానాలు ఉండాలని సూచించారు.పద్మశాలీలు రాజకీయాల్లోకి మరింతగా రావాలని, అందుకు అన్ని రాజకీయ పార్టీలు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.తెలుగు అకాడమీ తరఫున ఇంటర్మీడియట్ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల నగదు పురస్కారం అందజేస్తున్నట్లు వెల్లడించారు.తమ అకాడమీ ప్రతి సంవత్సరం దాదాపు రూ.10 కోట్ల విలువైన పుస్తకాలను ముద్రిస్తోందని తెలిపారు.




సూర్యాపేటతో తనకు ఎంతో అనుబంధం ఉందని, మారోజు వీరన్న వంటి ప్రముఖులను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణలోని 33 జిల్లాలను సందర్శించి అక్కడి పద్మశాలి సోదరులను కలుసుకోవాలన్న సంకల్పం ఉందన్నారు.తాను తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు అనుచరుడినని తెలిపారు. పద్మశాలీ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పద్మశాలి సమాజ అభ్యున్నతికి, తెలుగు అకాడమీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పెండం చంద్రశేఖర్, విశిష్ట అతిథి ప్రొఫెసర్ రుద్ర సాయి బాబా, అధ్యక్షులు పెండం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు యలగందుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పెండం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి చల్లమల్ల వెంకటరమణ, కోశాధికారి పెండెం కృష్ణ కుమార్, కార్యవర్గం సభ్యులు వైద్యులు పెండం వెంకటరమణ, మానుపూరి రాములు, ముషం రవి, రావిరాల మల్లయ్య, యలగందుల రామలింగయ్య, మానుపూరి ప్రసాద్, సన్మాన గ్రహీతలు కందలగడ్డ మల్లికార్జునరావు, కొంపల్లి అజయ్ కుమార్, గాజుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐ పార్టీలో ముదిరిన వర్గ పోరు

## కుదాబక్షపల్లిలో సమావేశం.. మండల నాయకుడికి సమాచారం ఇవ్వకపోవడంపై వివాదం

**మర్రిగూడ, ఆగస్టు 23 (జనం సాక్షి)**
సీపీఐ పార్టీలో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయా? అన్న చర్చ మర్రిగూడ మండలంలో మొదలైంది. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇవ్వకుండానే కుదాబక్షపల్లి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేయడం వివాదానికి దారితీసినట్లు సమాచారం.ఆదివారం కుదాబక్షపల్లి గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించేందుకు కొందరు నాయకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయం మండల ప్రధాన కార్యదర్శికి ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మర్రిగూడ మండల కన్వీనర్‌కు, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శికి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు వ్యక్తులు స్వార్థపూరిత రాజకీయాలకు పాల్పడుతూ పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తున్నారని అసంతృప్తి వర్గం ఆరోపిస్తున్నట్లు సమాచారం.మండలంలో నెలకొన్న అంతర్గత విభేదాలకు పార్టీ పెద్దలు వెంటనే తెరదించాలని కార్యకర్తలు కోరుతున్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు కల్పిస్తూ మర్రిగూడ మండల నూతన కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. వివాదం మరింత ముదరకముందే పార్టీ నాయకత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.12 వేల జీవనభృతి చెల్లించాలి: సీఐటీయూ



**మర్రిగూడ, ఆగస్టు 23(జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.చదువుకున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని యాదయ్య కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల జీవనభృతి అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వాహన చట్టం ఆటో కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు స్పేర్ పార్ట్స్ ధరలు పెరగడంతో ఆటో కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఆటో కార్మికుల ఉపాధికి భంగం కలిగించే విధంగా ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టే విధానాన్ని పునరాలోచించాలని, ఓలా, ఉబర్ వంటి సంస్థల వల్ల సంప్రదాయ ఆటో డ్రైవర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ఆటో బంద్‌లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు ఎదుళ్ల సునీతతో పాటు ఆటో యూనియన్ నాయకులు ఆవుల వెంకటయ్య, బుష్పాక వెంకటేశ్వర్లు, నారపాక విజయ్, పగడాల అంజయ్య, బైరగోని అంజయ్య, జంగయ్య, రాములు, ఎదుల యాదయ్య, ఎదుళ్ల సైదులు, కాంసెట్టి శ్రీనివాస్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాల పండుగ



**ఖమ్మం , ఆగష్టు 23 (జనంసాక్షి )**
గంగపుత్ర సంఘం జూబ్లీ పుర?సారధి నగర్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కొనసాగుతున్న సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలను నిర్వహించారు.
ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలను ఎత్తుకుని మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బయలుదేరారు. యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని జూబ్లీ పుర, సారధి నగర్ పురవీధుల్లో ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అనంతరం ఊరేగింపు ముత్యాలమ్మ గుడి సెంటర్‌కు చేరుకోగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం జూబ్లీ పుర?సారధి నగర్ అధ్యక్షులు కన్నం రమేష్, ప్రధాన కార్యదర్శి గోధుమల శ్రీనివాసరావు, కోశాధికారి సోమనబోయిన కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ముత్యాలమ్మ బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను అమ్మవారు చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ప్రత్యేక మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. ప్రజలు ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న కృష్ణ, నగర అధ్యక్షులు చేతి కృష్ణ, మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, మాజీ కౌన్సిలర్లు వంగాల వెంకట్, సింగం అంజయ్య, నాయకులు గోధుమల ఉపేందర్, కన్నం రాజేందర్, వడ్డెబోయిన బిక్షపతి, చేతి శ్రీనివాస్, నరుగుల ఆనంద్, కన్నం రవీందర్, పూజారి రాజు, సోమనబోయిన సత్యం, అంబటి రఘుబాబు, నరుగుల రవికుమార్, కన్నం నరేందర్, నరుగుల బలరాం శంకర్, కన్నం చంద్రశేఖర్, డోలి ప్రేమ్ సాగర్, సింగారపు త్రినాధ్, మైస కుమారస్వామి, తవిడబోయిన వీరేంద్ర, తవిడబోయిన శ్రీనివాస్, టుంగుటూరి నర్సింగరావు, నరుగుల రాజేష్, కన్నం రాము, వంగల రోహిత్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో జూబ్లీ పుర?సారధి నగర్ ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. భక్తుల సంతోషోత్సాహాల మధ్య ముత్యాలమ్మ బోనాల వేడుకలు ఘనంగా ముగిశాయి.



# తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందని తెలిపిన మహనీయుడు

**ఖమ్మం కార్పొరేషన్, ఆగష్టు 23 ( జనంసాక్షి)**
మహా ప్రవక్త ముహమ్మద్ జన్మదిన నెలను పురస్కరించుకొని జమాతే ఇస్లామీ హింద్ నార్త్ మహిళ శాఖ విభాగం ఆధ్వర్యంలోఇంద్రానగర్ శాఖ కార్యాలయంలో ప్రవక్త ముహమ్మద్ జీవితం మరియు బోధనల్లోని శాంతి, మానవత్వం, న్యాయం అనే అంశాలపై సింపోజియం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. రేహానా మాట్లాడుతూ మానవుల మధ్య సోదర భావాన్ని పెంపోందించిన మహనుబావుడు మహప్రవక్త ని అయన సత్ ప్రవక్తన, నిజాయితి , అణకువ , ప్రవిత్రలకు ప్రాముఖ్యత ఇచ్చారని పెర్కొన్నారు. సామాజిక సత్ సంబందాల విషయంలో కేవలం బోదించడమే కాకుండా దానిని స్వయంగా ఆచరించి అందరిచేత అచరింపచేశారని అన్నారు. ఆయన బోదనలు సర్వమానవాళికి ఎంతో అదర్శమంతమని అన్నారు. అనంతరం షకీలా బాను, అడ్వకేట్ నజీమా, ఎస్.డి. సమ్రీన్, హాజీరా సదఫ్ అతిథులు మహా ప్రవక్త ముహమ్మద్ గురించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. చివరిగా సిటీ నాజిమా అస్మా అంజుమ్ మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, వారి పట్ల చులకన భావం ఉండకూడదని ముహమ్మద్ ప్రవక్త విస్పష్టంగా ప్రకటించారు. స్రీ మీకు జన్మనిచ్చిన తల్లి ఆత్మీయత కురిపించే చెల్లి ప్రేమను పంచే ఇల్లాలు. అంతేకాదు తల్లిపాదాల క్రింద స్వర్గం ఉంది. ఆమెను ప్రేమించి, సేవించి మాత్రమే స్వర్గార్హత సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమ సంతానానికి ఉత్తమ విద్య నేర్పించాలని, నైతిక విలువలను ఉగ్గుపాలతో పోయాలని భావితరాల సంక్షేమానికి ఇది చాలా అవసరమని ప్రవక్త నొక్కి చెప్పారన్నారు. సమస్యల వలయంలో చిక్కుకుపోయిన నేటి మానవ సమాజానికి ఆయన ఉపదేశాల్లోనే పరిపూర్ణ పరిష్కారం ఉందని అన్నారు. కార్యక్రమంలో నార్త్ మహిళా విభాగం అధ్యక్షురాలు హుస్సేన్ బీ అరిఫా, తన్వీర్, తబస్సుమ్ షంషున్నిసా, సజీదా, అఫియా, ఫర్హానా, సలేహా బేగం, హబీబా, రహ్మత్, సల్మా, సీమా తదితరులు పాల్గొన్నారు.

# కర్ర పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**భద్రాచలం ఆగష్టు 23 (జనంసాక్షి)**
భద్రాచలం ఆదర్శనగర్ కాలనీలో కామ్రేడ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ర పూజా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై యువతతో కలిసి కర్ర పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత ఐక్యతతో ముందుకు సాగుతూ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, కాలనీ వాసులు పాల్గొన్నారు.





## మండలంలో పలు గ్రామాల్లో

# ముత్యాలమ్మ తల్లి పూజలు

**కామేపల్లి,ఆగష్టు 23 (జనంసాక్షి):**
కామేపల్లి మండలం లో పలు గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లి కి పూజలు నిర్వహించారు. మండలంలోని కామేపల్లి,జాస్తి పల్లి, ముచ్చర్ల,పాత లింగాల గ్రామాల్లో తెల్లవారుజామున మహిళలు జల బిందెలతో ముత్యాలమ్మ తల్లికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బోనాల సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని తమ పిల్లా పాపలను పశువులు, గేదెలను చల్లగా చూడాలని మొక్కులు మొక్కారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు అజ్మీర బుల్లి,ధరావత్ నాగమణి,లూసీ, కిన్నెర సుజాత, గ్రామాల పెద్దలు మల్లెంపాటి శ్రీనివాసరావు, శివయ్య,రామ్ రెడ్డి జగన్నాథరెడ్డి జాస్తి పల్లి ఉప సర్పంచ్ గేముల దేవండ్ల శైలజ తదితరులు పాల్గొన్నారు.

# పిట్టలగూడెం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**గుర్రంపోడు :ఆగష్టు 23 (జనంసాక్షి)**
గుర్రంపోడ్ మండలం పిట్టలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందపు రామ్మూర్తి ఫంక్షన్ హాల్, దర్వేశిపురం ఘనంగా నిర్వహించారు. ?పాఠశాలలో చదువుకున్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ, చిన్ననాటి స్నేహాలు, హాస్య సంఘటనలను పంచుకోవడానికి పూర్వ విద్యార్థులంతా ఒక్కటై ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ?ఈ సందర్భంగా విద్య నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించుకోవడంతో పాటు, అందరూ కలిసి విందు వినోదాలలో పాల్గొననున్నారు. 2008-09 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారు. పాలడుగు శ్రీధర్, పగిడిమర్రి మహేష్ , ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆగస్టు 27న మహాధర్నాను విజయవంతం చేయాలి



ఖమ్మం, ఆగష్టు 23, (జనంసాక్షి) :
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల భవన్‌లో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి జిల్లా ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల్లో ఉన్న అపోహలను తొలగించి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వేతన సవరణ సంఘాన్ని త్వరగా ఏర్పాటు చేసి, ఐదు శాతం మధ్యంతర భృతి ద్వారా పదిహేను శాతం వేతన ప్రయోజనం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు కొన్ని దశల్లో జరుగుతున్నాయని, ప్రత్యేక మార్గంలో వచ్చే బిల్లులు కూడా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. మిగిలిన బిల్లులను కూడా త్వరితగతిన చెల్లించాలని కోరారు. జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 27న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని కోరారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సేవా ప్రయోజనాలు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. మహాధర్నాకు ప్రతి శాఖ నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై జిల్లా ఉద్యోగుల ఐక్యతను చాటాలని నాయకులు కోరారు. ఐక్యత, క్రమశిక్షణ, శాంతియుత పోరాటంతో న్యాయమైన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా పి.డి.ఎస్.యు కొవ్వొత్తుల నివాళి

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 23 (జనంసాక్షి):**

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి దారుణ హత్యను పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నిరసనగా పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వంగూరి మాట్లాడుతూ,మైనర్లను మత్తు, జల్సాల వైపు నడిపిస్తున్నది ఎవరు? అని ప్రశ్నించారు. చిన్న వయసులోనే కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలు, విచ్చలవిడి ఖర్చులు, సోషల్ మీడియా మరియు సినిమాల ప్రభావానికి గురవుతూ తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి పిల్లల్లో కనీస గౌరవం, మర్యాదలు, క్రమశిక్షణ లోపించడం ఆందోళనకరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఉపాధ్యాయులకు పూర్తి సహకారం, తగిన స్వేచ్ఛ ఇవ్వాలని, చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలు నేర్పించాలని సూచించారు.సోషల్ మీడియా, సినిమాల ప్రభావంతో పాటు గంజాయి, కొకైన్ తదితర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారుతున్నా వాటి నియంత్రణలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రూపా రెడ్డి హత్య ఘటనలో నిందితులుగా ఉన్న మైనర్లు ఇలాంటి జల్సాలు, చెడు వ్యసనాలకు ఎలా గురయ్యారో ప్రభుత్వం, పోలీసు శాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మైనర్ల చెడు వ్యసనాలకు ప్రభుత్వం, పోలీసులే బాధ్యత వహించాలి.×× మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని, మైనర్లను ఈ ఉచ్చులోకి లాగుతున్న వ్యక్తులు, ముఠాలపై ఉక్కుపాదం మోపాలని పి.డి.ఎస్.యు డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమం లో పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, జిల్లా నాయకులు సురేష్, మురళి, పృథ్వీ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా డిగ్రీ వద్దు



**ఖమ్మం, (జనంసాక్షి) :**

న్యాయ విద్యను పూర్తి చేసిన తమకు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా డిగ్రీ ప్రదానం చేయడంపై నల్సార్ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై దాడులు జరిగిన సందర్భంలో బాధితుల పట్ల సరైన స్పందన లేదని ఆరోపిస్తూ సుమారు 450 మంది విద్యార్థులు సంతకాలతో నిరసన లేఖను రూపొందించినట్లు యువ న్యాయవాది నామాల సాయిబాబా తెలిపారు.న్యాయ విద్యార్థులపై దాడులు జరిగిన సమయంలో బాధితుల ఆవేదనను పట్టించుకోలేదని, సంబంధిత ఘటనలకు సంబంధించిన వీడియోలను చూసేందుకు సమయం లేదంటూ వ్యాఖ్యలు వినిపించాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో పలువురు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వారి గొంతు వినిపించలేదని పేర్కొన్నారు.న్యాయం కోసం చదువుకున్న విద్యార్థులకు డిగ్రీ కేవలం ఒక కాగితం కాదని, అది తమ విలువలు, విద్య, భవిష్యత్తుకు ప్రతీక అని విద్యార్థులు పేర్కొన్నారు. అలాంటి డిగ్రీని తమ విలువలకు విరుద్ధంగా భావిస్తున్న వ్యక్తి చేతుల మీదుగా స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. "న్యాయం అంటే చట్టంలోని అక్షరాలను చదవడం మాత్రమే కాదు.. అన్యాయం జరిగినప్పుడు బాధితుడి పక్కన నిలబడటం కూడా" అని విద్యార్థులు పేర్కొన్నారు. డిగ్రీ ప్రదానోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దని, విద్యార్థుల విలువలను గౌరవించాలని వారు విజ్ఞప్తి చేశారు. 450 మంది విద్యార్థుల గొంతులు కలవడం కేవలం ఒక లేఖ కాదని, న్యాయం కోసం విద్యార్థి సమాజం లేవనెత్తిన నిరసన స్వరమని నామాల సాయిబాబా పేర్కొన్నారు. డిగ్రీ తీసుకునే రోజు తమ తలలు వంచే పరిస్థితి రాకూడదని, తమ మనస్సాక్షికి విరుద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉండకూడదని విద్యార్థులు స్పష్టం చేశారు.

## దారా భారతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన మున్సిపల్ చైర్మన్ మోహన్

**కల్లూరు ఆగస్టు 23(జనంసాక్షి)**

కల్లూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ ధారా రంగ మాతృమూర్తి ధార భారతి ఇటీవల మృతి చెందగా ఆమె దశదినకర్మ కార్యక్రమం కల్లూరు లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరై కీర్తిశేషులుధారా భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ,ఆమె పవిత్రఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు దార రామారావు, దారా బాబు లతోపాటు కుమారులు రంగా,రమేష్, శ్రీను, మనువడురాజీవ్ లను పరామర్శించి మనోధైరం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్ , బొల్లం రామారావు,ధరవత్ రవికుమార్, వాసు, సాంబ తదితరులు పాల్గొన్నారు.



## మతోన్మాదాన్ని ప్రతిఘటించాలి

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 23( జనంసాక్షి)**




స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం ఖమ్మం అర్బన్ టూ టౌన్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు పలు అంశాలపై క్లాసులు నిర్వహించారు. ఉదయం "పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామ క్రమంలో మన కర్తవ్యం" అనే అంశంపై బండారు రమేష్ బోధించారు. సాయంత్రం "మతం?మతోన్మాదం, దాన్ని ప్రతిఘటించాలి" అనే అంశంపై బోడపట్ల రవీందర్ క్లాస్ నిర్వహించారు.ఈ సందర్భంగా బోధకులు మాట్లాడుతూ, మతం వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశమని, అయితే మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించి ప్రజల మధ్య విభజన సృష్టించడం మతోన్మాదానికి దారితీస్తుందని అన్నారు. మతోన్మాదం ప్రజల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రమాదకరమని, దానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచి లౌకిక, ప్రజాస్వామ్య భావాలను బలోపేతం చేయడం వామపక్ష కార్యకర్తల కర్తవ్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, జిల్లా నాయకులు, ఖమ్మం అర్బన్ టూ టౌన్ కార్యదర్శులు బత్తిని ఉపేందర్, బోడపట్ల సుదర్శన్, నాయకులు జే. వెంకన్నబాబు, సీహెచ్. వీరభద్రం, డి. వీరబాబు, తీగల వెంకటేశ్వర్లు, పి. సుభాష్, ఎన్. పావని, ఎస్.కే. బీబీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాలు ఉత్సవం

**వలిగొండ, ఆగస్టు 23( జనం సాక్షి )**

మండలంలోని ఊరుబోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరారు. వేడుకల్లో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కొత్తగూడెంలో నేత్రపర్వంగా శ్రావణ మాస పోచమ్మ తల్లి బోనాల జాతర

- కొత్తగూడెం పట్టణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగిన బోనాల ఊరేగింపు
- ఆలయ ధర్మకర్త పల్లా రాజనర్సు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు
- అమ్మవారి రథోత్సవం, కోలాటాలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలు



**కొత్తగూడెం 23 ఆగస్టు జనంసాక్షి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శ్రావణ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుకను శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవస్థానం ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త పల్లా రాజనర్సు ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి విజయవంతం చేశారు. ఈ జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో కళాకారుల డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు పల్లె సంస్కృతిని తలపించాయి. అమ్మవారి వివిధ రకాల వేషధారణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.మహిళలు ఎంతో భక్తితో శిరస్సుపై బోనాలు ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి తొలుత బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరతో కొత్తగూడెం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# పూరిల్లు, గుడిసెలు లేని నియోజకవర్గంగా అశ్వరావుపేటను తీర్చిదిద్దుతాం

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే జారె ఆది నారాయణ



**చంద్రుగొండ, ఆగస్టు 23 (జనంసాక్షి):** పేదల సొంతింటి కలను సాకారం చేసి, పూరిళ్లు, గుడిసెలు లేని నియోజకవర్గంగా అశ్వరావుపేటను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జారె ఆది నారాయణ అన్నారు. ఆదివారం చంద్రుగొండ మండలంలోని గుర్రాయిగూడెం, రావికంపాడు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై బేస్‌మెంట్ స్థాయిలోనే నిర్మాణాలు నిలిచిపోయిన లబ్ధిదారులకు ఫేజ్?2లో సుమారు 500 ఇళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో పూరిళ్లు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్నవారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి అర్హులైన కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు, సహకారంతో అశ్వరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

**రూ.67 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం**

గుర్రాయిగూడెం రైల్వే బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలుస్తున్న సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో మూడు రోజుల క్రితమే అధికారులను అక్కడికి పంపించి పరిశీలన చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు. చంద్రుగొండ–గుర్రాయిగూడెం–మద్దుకూరు నుంచి బాలే తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నియోజకవర్గవ్యాప్తంగా రూ.67 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని, రహదారి సౌకర్యాలను మెరుగుపరిచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే పలు కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రావికంపాడులో నిర్వహించిన బోనాల ఉత్సవంలో పాల్గొని బోనాలు ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బొజ్యా నాయక్, దారం గోవిందరెడ్డి, తుమ్మలపల్లి సురేష్, మాలోత్ గోపాల్, ఇస్లావత్ రుక్మిణి, బోయిన భోగి కోటేశ్వరరావు, బొర్రా సురేష్, పజల్ భక్ష్, ఇమ్రాన్, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## సర్పంచ్ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 23 ( జనంసాక్షి )**

ఈనెల 25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యు క్లబ్ లో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాల అభివృద్ధి జరగాలని, గ్రామాలు శక్తివంతంగా స్వచ్ఛందంగా పచ్చదనంగా ఉంటేనే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపులు సర్పంచ్ పాలనకు కేటాయింపులు చేయాలని కోరారు. చెక్కు పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 జి లో ఆర్టికల్లోని 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయాల్టీ ట్యాక్సీలు ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచుల అందరికీ గౌరవ వేతనం 30 వేలు ఇవ్వాలని కోరారు. రేపు ఖమ్మం లో జరిగే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బెల్లం శ్రీనివాస్, లోడిగా వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న తోటి స్నేహితులు

**కల్లూరు ఆగస్టు 23( జనం సాక్షి )**

మండల పరిధి పెద్దకొరుకొండి గ్రామానికి చెందిన మేకల సూర్య కిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు . గ్రామానికి చెందిన తోటి స్నేహితులు మానవతా దృక్పథంతో స్నేహితుని కుటుంబానికి అండగా కుమార్తె భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని 1, లక్ష9,000వేల రూపాయలను అభినయశ్రీ పేరు మీద సుకన్య సంవృద్ధి పథకంలో బాగంగా ఫిక్స్ డిపాజిట్ చేసి బ్యాంక్ ఖాతా పుస్తకాన్ని స్నేహితుల సమక్షంలో ఆదివారం కుటుంబ సభ్యులకు అందించి దాతృతాన్ని చాటుకున్నారు. అందరితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ మంచి వ్యక్తిగా పేరు మంచి స్నేహితున్నీ కోల్పోయామంటూ వారు భావోద్వేగానికి లోనయ్యారు. సహచర మిత్రుని కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పంతో ఫిక్స్ డిపాజిట్ రూపంలో ఆర్థిక సహకారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ వినయ్ కుమార్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు గూడా రవిబాబు, మేకల లక్ష్మణ్, మేకల రామారావు, మేకల సురేష్, వేము రాజేష్, అడవికట్ల డొమినిక్, మేకల రాజేష్ వేము రాజేష్, వేము నాగరాజు, యర్ణం రాజు,మేకల శ్రీనివాస్, పసుపులేటి వెంకటేశ్వర్లు, వేము రామారావు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## టెన్త్ క్లాస్ మిత్రుడి కుటుంబానికి రూ.90 వేలు ఆర్థిక సహాయం

**ఖమ్మం, (జనంసాక్షి) :**

తమతో కలిసి చదువుకుని తనువు చాలించిన తోటి స్నేహితుడి కుటుంబానికి రూ.90 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని రిక్కాబ్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1999–2000,బ్యాచ్) టెన్త్ క్లాస్ వరకు తమతో కలిసి చదువుకుని, హైద్రాబాద్ లో స్థిరపడిన దండు రామకృష్ణ(38) జూన్ 24వ తేదీన షుగర్ లెవల్స్ ఎక్కువయ్యి గుండె పోటు తో హఠాన్మరణం చెందారు. తోటి స్నేహితుడి హఠాన్మరణం తెలుసుకున్న మిగతా మిత్రులు వాట్సాప్ గ్రూప్ లో స్నేహితులందరూ కలిసి నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని నిశ్చయించుకున్నారు. స్నేహితుల ద్వారా రూ.90 వేలు సేకరించారు. సేకరించిన ఆర్థిక సహాయాన్ని ఆదివారం హైద్రాబాద్ వెళ్లిన మిత్ర బృందం ఆ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో షేక్. మాదార్(మాజీ సైనికుడు),మోగిలి శ్రీనివాసరావు,గుజ్జులూరి ఉప్పలయ్య(కోర్ట్ ఉద్యోగి),సల్లూరి భాస్కర్(డిఫెన్స్ ఉద్యోగి),పేరబోయిన తిరుపతి రావు,ఎర్రగాని రఘు తదితరులు ఉన్నారు.

## ఆళ్లపల్లి నుండి అనిశెట్టిపెల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరు

**98 కోట్ల 80 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**

**మంత్రి పొంగులేటి శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఫోటోలకు పాలాభిషేకం**

**గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ యొక్క లక్ష్యం**

**ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్**



**ఆళ్లపల్లి ఆగస్టు 23 (జనం సాక్షి):** మండల కేంద్రం నుండి,అనిశెట్టిపల్లి వరకు సుమారు 98 కోట్ల 80 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్,మాట్లాడుతూ ఆళ్లపల్లి నుండి కిన్నెరసాని వంతెన వరకు 30 కోట్ల 21 లక్షలు,కిన్నెరసాని బ్రిడ్జి నుండి అనిశెట్టిపల్లి వరకు 68 కోట్ల 67 లక్షలు, మొత్తం 98 కోట్ల 80 లక్షలు,మంత్రి పొంగులేటి, శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంజూరు కి ఎంతో కృషి చేశారని తెలిపారు ఆళ్లపల్లి మండలాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కార్యకర్తలు నాయకులు బాణాసంచా కాల్చి మంత్రి పొంగులేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల ఫోటోలకు పాలాభిషేకం చేశామని తెలిపారు. 2029 సంవత్సరంలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లడం మానుకోవాలని ఏం చూసుకొని మూడుస్తున్నారో తెలవటం లేదని ఎద్దేవా చేశారు. ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ వాసం సుస్మిత,రామంజగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మోకాళ్ళ చంద్రశేఖర్, అనంతోగు సర్పంచ్ వెంకటేష్,మర్కోడు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సునీత,పర్వీన్, సాయి, భరత్,రవి,ప్రశాంత్,వీరభద్రా చారి,మంగ,తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల అసంతృప్తిపై అధిష్టానం దృష్టి సారించేనా..?




❑కాంగ్రెస్ విజయానికి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తలకు గుర్తింపు కరువు?

❑ హామీలు అమలు చేయండి.. మా కుటుంబాలను ఆదుకోండి..

**అశ్వాపురం ఆగస్టు 23 (జనంసాక్షి):**
2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో పగలు?రాత్రి తేడా లేకుండా జెండా మోసి, ఇంటింటికీ తిరిగి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలే ఇప్పుడు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్ వైపు మళ్లించడంలో యువత, మహిళలు, నిరుద్యోగులు, సాధారణ కార్యకర్తలు కీలకంగా పనిచేశారని వారు గుర్తుచేస్తున్నారు.అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో తమ శ్రమను గుర్తించిన నాయకత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్న ఆవేదన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. పదవులు అడగడం లేదని.. కనీసం తమ కష్టాన్ని గుర్తించి, అర్హత ఉన్న సంక్షేమ పథకాల్లో తమ కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు.హామీలు ఎక్కడ? అమలు ఎప్పుడు?ఎన్నికల సమయంలో ప్రకటించిన సంక్షేమ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా అర్హులైన నిరుద్యోగులు, విద్యావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. అంబేద్కర్ అభయహస్తం వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అంటున్నారు. ఫొటోలు కాదు.. నిజమైన కార్యకర్తకు గుర్తింపు కావాలి.పార్టీ కోసం కష్టపడకుండా కేవలం కార్యక్రమాల్లో కనిపిస్తూ పదవుల కోసం ప్రయత్నించే వారికి కాకుండా గ్రామస్థాయి నుంచి పార్టీ జెండాను మోసిన నిజమైన కార్యకర్తలను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. "పార్టీ కోసం కష్టపడింది మేము.. ఎన్నికల్లో ఓట్లు అడిగింది మేము.. మరి గుర్తింపు మాత్రం మరెవరికో?" అంటూ పలువురు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కార్యకర్త అసంతృప్తి.. కాంగ్రెస్‌కు హెచ్చరిక.కార్యకర్తల ఆవేదనను ఇప్పటికైనా నాయకత్వం పట్టించుకోకపోతే పార్టీ కేడర్‌లో అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలను గుర్తు చేసుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడే వారి వెంట నిలబడాలని సూచిస్తున్నారు.డీసీసీల ద్వారా నిజమైన కార్యకర్తలను గుర్తించాలి.ప్రతి జిల్లాలో డీసీసీల ఆధ్వర్యంలో మండల, గ్రామస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించి, వారి సమస్యలపై నివేదిక రూపొందించాలని డిమాండ్ వినిపిస్తోంది. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు, సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాల్లో క్షేత్రస్థాయి కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. కార్యకర్త బలంగా ఉంటేనే.. మళ్లీ కాంగ్రెస్ బలంగా ఉంటుంది.రాబోయే ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికైనా కార్యకర్తల్లో నమ్మకం, ఉత్సాహం నింపేలా ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని కార్యకర్తలు కోరుతున్నారు."కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది.. కార్యకర్త కుటుంబం బాగుంటేనే అతను పార్టీ కోసం మళ్లీ జెండా మోస్తాడు. మాకు పదవులు వద్దు.. మా శ్రమకు గుర్తింపు, మా కుటుంబాలకు న్యాయం, ఇచ్చిన హామీల అమలే కావాలి" అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు ముక్తకంఠంతో కోరుతున్నారు.అధికారం కోసం జెండా మోసిన కార్యకర్తను అధికారంలోనూ గౌరవిస్తేనే "మళ్లీ కాంగ్రెస్" లక్ష్యం సాకారం అవుతుందని, లేదంటే క్షేత్రస్థాయి అసంతృప్తి పార్టీ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## ముత్యాలమ్మ జాతరలో పాల్గొన్న సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి

**మేళ్లచెరువు జనం సాక్షి**
ముత్యాలమ్మ జాతర – బోనాల పండుగ సందర్భంగా మేళ్లచెరువులో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది.

## ముత్యాలమ్మ జాతరలో ప్రత్యేక పూజలు...

### సర్పంచ్ మందా నాగరాజుకు ఘన సన్మానం..

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఆదివారం ఏబీఆర్ యూత్, ఆరో వార్డు మెంబర్ తోకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించి మేళతాళాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏబీఆర్ యూత్ ఆధ్వర్యంలో సర్పంచ్ మందా నాగరాజును ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తోకల శ్రీనివాస్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేసు ఒక రాజేష్, కాంగ్రెస్ నాయకుడు అలవాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు

**ఖమ్మం / వైరా , ఆగస్టు 23 ( జనంసాక్షి )**
వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రజలకు విముక్తి కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులు సుభిక్షంగా ఉండాలని ముత్యాలమ్మ తల్లిని, బొడ్రాయిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నారు.

# పోతిరెడ్డి కుటుంబ వివాహ వేడుకకు ప్రముఖుల సందడి

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)**
పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి సన్నిధానంలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పోతిరెడ్డి కుటుంబ వివాహ వేడుకకు రాజకీయ, పోలీసు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బూర్గంపహాడ్ మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి?సత్యవతి దంపతుల కుమారుడు చెన్నకేశవరెడ్డి, స్రవంతిల వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన వస్త్రాలు అందజేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు వేడుకకు హాజరై పోతిరెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.పోలీసు శాఖ నుంచి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ సతీష్ కుమార్, పలువురు సీఐలు, బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ హాజరయ్యారు. రెవెన్యూ శాఖ నుంచి బూర్గంపహాడ్ తహసీల్దార్ ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజకీయ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో వివాహ వేడుక సందడిగా సాగింది. పోతిరెడ్డి కుటుంబ సభ్యులు అతిథులకు సాదర స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు.



## ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలి

**రాజారెడ్డిగూడెం మండల ( జనంసాక్షి )**
సీతారాంపురంలో అవగాహన కల్పిస్తున్న సారథి కళాకారులు ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో తలెత్తిన రైతులు అరుతడి పంటలను సాగుచేయాలనీ తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ నాగరాజు అన్నారు. సీతారాంపురం గ్రామంలో ఆదివారం సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం ఆరతడి పంటల సాగు తదితర అంశాలపై ఆటపాటల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల శంకర్, సైదులు,లక్ష్మీ,మేడిపల్లి వేణు,శిరీష, రాధ,తదితరులు పాల్గొన్నారు.

